# 'ఎంఐవీఎస్'తో హృద్రోగ శస్త్ర చికిత్స

చెన్నై, న్యూస్‌టుడే: అందుబాటులోకొస్తున్న ఆధునిక వైద్య పరిజ్ఞానంతో శస్త్ర చికిత్సలకు మార్గం మరింత సులభతరమవుతోందని మియాట్ ఆసుపత్రిలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. వైద్య నిపుణులు డాక్టర్ ఎం. చాండీ, డాక్టర్ ఫ్రాంక్ బూస్ (జర్మనీ) డాక్టర్ చెరియన్, డాక్టర్ మోహన్‌దాస్ (ఎండీ), నికోలస్ డాల్ (జర్మనీ), డాక్టర్ బషి తదితరులు దీనికి సంబంధించిన విషయాలను చెప్పారు. హృద్రోగ శస్త్ర చికిత్సలలో సాధారణంగా 700 ఎం.ఎల్. రక్త నష్టం, గుండె ప్రాంతంలోని ఎముకలను కోయటం, కనిష్ఠంగా పదిరోజుల పాటు ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉండటం విధాయకమని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులోకొచ్చిన 'మినిమల్లీ ఇన్‌వేసివ్ కార్డియాక్ సర్జరీ' విధానంలో గరిష్ఠ రక్తనష్టం కేవలం 200 ఎం.ఎల్.మాత్రమేనని, ఎముకలను కోయకుండా పరిస్థితిని సునాయాసంగా చక్కదిద్దటం మరో ప్రత్యేకత అని వివరించారు. అయిదు రోజులు మాత్రం ఆసుపత్రిలో ఉంచి డిశ్చార్జి చేయడం జరుగుతుందని తెలిపారు. ఎముకలను కోయకపోవడం వంటి సౌకర్యాలతో నొప్పులు వంటి సమస్యలు అతి స్వల్పమని చెప్పారు. 15 సంవత్సరాల క్రితం ప్రప్రథమంగా అందుబాటులోకొచ్చిన ఈ విధానం మరింత ఆధునిక పరిజ్ఞానంతో విస్తరిస్తోందని డాక్టర్ నికోలస్ డాల్(జర్మనీ) తెలిపారు. ఈ తరహా శస్త్ర చికిత్సలకు సంబంధించి శుక్ర, శనివారాల్లో దేశవ్యాప్తంగా పలు ప్రాంతాలకు చెందిన వంద పైచిలుకు హృద్రోగ వైద్యులతో సదస్సు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. జూనియర్ వైద్యులకు ఈ తరహా చికిత్సలపై మార్గదర్శక సూత్రాలను సదస్సులో తెలియజేయడం లక్ష్యమని తెలిపారు. సదస్సు సందర్భంగా వైద్య పరికరాలు తయారుచేసే దేశ, అంతర్జాతీయ సంస్థలు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశాయి.




డాక్టర్ చాండీ ఫ్రాంక్ బూస్, మోహన్‌దాస్ తదితరులు